క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



హెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

మద్దిలపాలెం : వేసవి తాపం తీవ్రం కావడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 15వ వార్డు హెచ్‌బీ కాలనీలోని శ్రీవెంకటేశ్వర మినీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని ఏఐటీయూసీ ఆటో అధ్యక్షుడు పడాల గోవింద్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు మధురెడ్డి, నాయకులు బర్నికెట్టి శ్రీనివాస్, జగదీష్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యపై అవగాహన

బీచ్ రోడ్డు: ఇంటర్ పూర్తయి తరువాత ఐఐటీ, నీట్, జేఈఈ పరీక్షలకు సంబంధించి ఉన్నత విద్యపై ఉడాన్ పేరుతో బుధవారం అన్ అకాడమీ సంస్థలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యపై విద్యార్థులకు ఉన్న సందేహాలను నిపుణులు నివృత్తి చేశారు. సిలబస్, పరీక్షల సరళి, అభ్యాస విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రీజనల్ కో ఆర్డినేటర్ జగ్నూర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

'బాలరాముడి నుదుటిపై సూర్య తిలకం అద్భుతం'

ఎంవీపీ కాలనీ: అయోధ్యలో జరిగిన రాముని పట్టాభిషేకం, బాలరాముని నుదుటిపై సూర్యకిరణాలు ప్రసరించడం ఒక అద్భుత ఘట్టమని బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అభివర్ణించారు. బుధవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని, నీటి కొరతను తీర్చే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. జీవీఎంసీ ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇంటలెక్చువల్ సెల్ కన్వీనర్ వసంత్‌కుమార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

నోట్లతో అలంకరణ



గోపాలపట్నం: గోపాలపట్నం ప్రశాంతినగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుని జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాబాను సాయిబాబాను కరెన్సీతో విశేషంగా అలంకరించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, బెహరా భాస్కర రావు, గుణికెట్టి శ్రీనివారావు, అప్పలస్వామి నాయుడు, పేడాడ రమణి కుమారి బాబాను దర్శించుకున్నారు.

కార్మికుల పోరాటం స్ఫూర్తిదాయకం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఇంతటి సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఘనత 'ఉక్కు' కార్మికులకే చెందుతుందన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1161వ రోజు, బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. విశాఖ ఉక్కు దీక్షను స్ఫూర్తిగా తీసుకుని దేశవ్యాప్తంగా కార్మికవర్గం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్లాంట్‌లో ఉన్న విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

- వైభవంగా శ్రీరామ నవమి ఉత్సవాలు
- మార్మోగిన శ్రీరామ నామ స్మరణ



ఇందిరానగర్ రామాలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ ఆవరణలో సీతారామ కల్యాణం జరుపుతున్న అర్చకులు



ఇందిరానగర్ రామాలయంలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



దీన్‌దయాల్‌పురం రామాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ కెల్ల సునీత



11వ వార్డు పార్వతీనగర్ రామాలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: శ్రీరామ నవమి వేడుకలు తూర్పు నియోజకవర్గంలో బుధవారం ఘనంగా జరిగాయి. సీతారాముల కల్యాణం కనులారా తిలకించి భక్తజనం పులకించింది. శ్రీరామ నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆరిలోవ ప్రాంతంలో రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. పైనాపిల్ కాలనీ రామాలయం, దుర్గాబజార్, రవీంద్రనగర్ దరి ఎస్‌ఐజీ నగర్, ఇందిరానగర్, విశాలాక్షినగర్‌లో రామాలయాలు, హనుమంతవాక వద్ద కోదండ రామాలయం, వెటర్నరీ కాలనీ, శ్రీహరినగర్, భరత్‌నగర్‌లలో వేంకటేశ్వరస్వామి ఆలయాలు, శ్రీకాంత్‌నగర్‌లో ఆంజనేయ స్వామి ఆలయం, చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆంజనేయ గుడి తదితర ఆలయాలలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సీతారాములను పల్లకిలో ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- రామాలయాల్లో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాలను వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సందర్శించారు. జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల పరిధిలోని విశాలాక్షినగర్, ఎస్‌ఐజీ నగర్, పార్వతీనగర్, దుర్గాబజార్, చినగదిలిలో దీన్‌దయాల్‌పురంతో పాటు 15, 16, 19, 21, 28 వార్డుల్లోని పలు రామాలయాలను ఆయన సందర్శించి పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంవీవీ వెంట ఉన్నారు.

బీచ్ రోడ్డు: శ్రీరామ నవమి సందర్భంగా జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పన్న మూర్తి, కోరాడ శ్రీను, దువ్వి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 21వ వార్డు ఏయూ అవుట్ గేటు ఎదురుగా కల్యాణ్ నగర్‌లోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల దివ్య తిరుకల్యాణం, పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి మదుపాడ రవికుమార్ దంపతలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.రాంబాబు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాతవెంకోజీపాలెంలో..

మద్దిలపాలెం: పాతవెంకోజీపాలెంలో శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం ఘనంగా జరిగింది. హెచ్‌బీ కాలనీ, సింహాద్రిపురం, జీఆర్ నగర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి వేడుకను తిలకించారు. ఈ సందర్భంగా సీతమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలు, వస్త్రాలు, అరటి పండ్ల గెల, లడ్డూలు, బూరెలు, అరిసెలు, పంచదార చిలకలు, పానకం, వడపప్పు, చలివిడి తదితర సారె సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సీతారామ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆడారి పరదేశి, యల్లపు నాగరాజు, తదితరులు ఏర్పాట్లు చేశారు.



శివాజీపాలెంలో అన్నదానం చేస్తున్న పీతల గోవింద్



ఏయూ అవుట్ గేటు సమీప కల్యాణ్ నగర్‌లో తిరుకల్యాణ్ మహోత్సవం



పాత వెంకోజీపాలెంలో కోలాటం ఆడుతున్న మహిళలు



పాత వెంకోజీపాలెం సీతారామాలయంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తూర్పులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం

- విశాఖ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 19వ వార్డులో విస్తృత ప్రచారం



19వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ప్రచార పర్వం

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం బుధవారం 19వ వార్డులో హుషారుగా సాగింది. 91వ రోజు 19వ వార్డు పెదజాలరిపేటలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలన, సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను తూర్పు ఎమ్మెల్యేగా, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా ఎంవీవీకి ప్రతి ఇంటా ఓటర్లు నీరాజనాలు పలికారు. హారతులు పడుతూ ఎంవీవీని స్వాగతించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతూ 20వ వార్డు పెదవాల్తేర్‌లో పార్టీ నాయకులు పండరీబాయ్, మద్ది పోలిరెడ్డి, బుజ్జి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఇంటింటి ప్రచారం చేశారు. ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.రమాదేవి, బుజ్జి, కాగితాల గోవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం, ఇతర ప్రాంతాలకు చెందిన 100 మందికి పైగా టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం గంపల వెంకట రామచంద్రరావు ఆధ్వర్యంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలన, అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ 22వ వార్డులో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయంలో భాగస్వాములుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గోపాలపురం పరిశీలకుడు గన్నమనేని వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు తలారి సురేష్, అడబాల క్రాంతి, సియాద్రి వెంకటరావు, జి.వీర భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సొంతింటి కల సాకారం



సభలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

- వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 10వ వార్డులో సిద్ధం సభ

ఆరిలోవ: రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్ దరి సుందర్‌నగర్‌లో ×మేము సిద్ధం -మా బూత్ సిద్ధం×సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలుచేసిన నవరత్నాలు, జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. తూర్పు నియోజకవర్గంలో ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.కొన్ని వందల కోట్లు నిధులు ఖర్చు చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 10వ వార్డులో ఇందిరానగర్ నుంచి ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ వరకు రోడ్లు, కాలువలతో పాటు యూపీహెచ్‌సీల నిర్మాణం, సామాజిక భవనాల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఎంపీ స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. గతంలో ఆయన ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతోనే ఇంటికి పంపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, స్థానిక నాయకుడు బొండా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టరేట్‌లో 'తూర్పు' అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఆర్వో, జేసీ మయూర్ అశోక్



పోలింగ్ మెటీరియల్ బ్యాగ్‌ను చూపిస్తున్న తూర్పు ఆర్వో, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ఎన్నికల ప్రక్రియలో అతి కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు విశాఖ తూర్పు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జేసీ కె.మయూర్ అశోక్ చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ కోసం మెటీరియల్ బ్యాగ్ కూడా సిద్ధం చేశామన్నారు. ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్లను దాఖలు చేయవచ్చని, ఒక అభ్యర్థి ఏవైనా రెండు స్థానాల్లో మాత్రమే పోటీ చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతిస్తామని, మిగతా వారిని 100 మీటర్ల దూరంలో నిలిపివేస్తామన్నారు. అభ్యర్థితో మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అసెంబ్లీ అభ్యర్థులు రూ.10 వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ఈ నామినేషన్ల ప్రక్రియను పూర్తిగా రికార్డు చేసేందుకు అభ్యర్థులు ప్రవేశించే ద్వారం వద్దతో పాటు దరఖాస్తులు స్వీకరించే గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. మోడల్ కోడ్ అమల్లో భాగంగా అభ్యర్థుల ఊరేగింపు, నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమాలను సైతం వీడియో రికార్డింగ్ చేస్తామన్నారు.

13 రకాల డాక్యుమెంట్లు తప్పనిసరి

అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురావాలని, అసెంబ్లీకి పోటీ చేసేవారు ఫారమ్ 2బీలో దరఖాస్తు చేయాలని ఆర్వో తెలిపారు. నోటిఫైడ్ తేదీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, పబ్లిక్ సెలవు దినాలలో నామినేషన్లు స్వీకరించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థి నామినేషన్ వేసిన నాటి నుంచి ఖర్చుల నమోదు మొదలవుతుందని, అభ్యర్థి పేరిట కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాలని సూచించారు. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను సైతం అభ్యర్థి ఖాతాలో లెక్కిస్తామన్నారు.

79 సమస్యాత్మక పీఎస్‌లు

తూర్పు అసెంబ్లీ పరిధిలో మొత్తం 79 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించామని జేసీ తెలిపారు. ఇక్కడ అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

చురుగ్గా కాపు కల్యాణ మండపం నిర్మాణం

గోపాలపట్నం: జీవీఎంసి 92వ వార్డు పద్మనాభనగర్‌లో కాపు కల్యాణ మండపం చురుగ్గా సాగుతోంది. ఈ నిర్మాణం మూడు నెలల క్రితం జీవీఎంసీ నిధులతో సుమారు అరూ.2 కోట్లతో కాపు కల్యాణ మండపాన్ని వైఎస్సార్‌సీపీ పశ్చిమ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చాలా మేరకు ప్లాస్టింగ్‌లు పూర్తి చేయగా, ఫ్లోరింగ్ వంటి పనులు చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే గోపాలపట్నం ప్రాంత కాపులకు ఒక వేదిక సమకూరినట్లవుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పక్షులకు అందుబాటులో తాగునీరు



ఏకో వైజాగ్ ప్లకార్డులు, మట్టి ప్రమిదలతో విశాఖ మరియా మేక్స్ సంస్థ మహిళలు

ఆరిలోవ: వేసవికి విలవిల్లాడుతున్న పక్షులు, పశువులకు తాగునీటిని అందించడానికి విశాఖ మరియా మేక్స్, గ్రీన్ క్లైమేట్ బృందం ఆధ్వర్యంలో బుధవారం ఆరిలోవలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చెట్లు, మొక్కల నీడలో వెడల్పయిన మట్టి పాత్రలు ఏర్పాటు చేసి వాటిలో నీరు పోశారు. ఆ నీటిని పక్షులు, పశువుల తాగడానికి వీలుగా ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశాఖ మరియా మేక్స్ సిస్టర్ సెల్వీ మాట్లాడుతూ పక్షులు, పశువులకు దాహం తీర్చడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. సంస్థల సభ్యులు రాజేశ్వరి, డి.వి.లక్ష్మి, సీహెచ్.అక్కమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

ఘనంగా ముత్యమాంబ తొలేళ్ల సంబరం

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం పరిధి గవర కంచరపాలెం ముత్యమాంబ అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు గ్రామాభ్యుదయ సంఘం అధ్యక్ష-కార్యదర్శులు దాడి సూర్య అప్పారావు, మళ్ల శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గురువారం తెల్లవారు జాము నుంచి అమ్మవారి ప్రత్యేక దర్శనాలతో ప్రధాన జాతర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి నగర ప్రాంతాల మీదుగా అమ్మవారి ఉత్సవ ప్రతిమల ఊరేగింపు కనుల పండువగా సాగింది. భక్తులు తలపై అమ్మవారి ప్రతిమలను జగదాంబ కూడలి, అల్లిపురం, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులుపేట ప్రాంతాల మీదుగా కంచరపాలెం పుట్టబంగారం అమ్మవారి మూలవిరాట్ వద్దకు చేర్చారు.

ప్రత్యేకతల పండగ...

దశాబ్దాల నుంచి అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం నాటి ఊరేగింపులో ఒడిశాకు చెందిన బ్యాండు సింగారి మేళ, తప్పెటగుళ్లు, విజయనగరం పులివేషాలు, వివిధ జంతువుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి కీర్తనలు, ఆలపిస్తూ ధూప, దీప నైవేద్యాలు, సమర్పిస్తూ, హారతులతొ భక్తులు ముందుకు సాగారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నేడు ప్రధాన జాతర

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో వెలసిన ముత్యమాంబ ఆలయంలో గురువారం జరిగే ప్రధాన జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, శీతలపానీయాలు అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

రామాయణం మానవేతిహాసం



మాట్లాడుతున్న రచయిత సూర్యారావు

సీతంపేట: రామాయణం మానవీయ విలువలకు పట్టం కట్టిన మహాకావ్యమని రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు పేర్కొన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో 'రామాయణం-సమాజం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఆదికవి వాల్మీకి కరుణార్ద్ర హృదయం నుంచి శోకం శ్లోకంగా వెలువడి తరతరాలకు ఆరాధనీయమైన రామాయణ గ్రంథంగా ఉద్భవించిందన్నారు. రామాయణ కావ్యం కుటుంబ గాథ అని, అయోధ్యలో, కిష్కింధలో సోదర సంబంధాలు ఎలా ఉన్నాయో చిత్రించారన్నారు. ఆ కావ్యం ప్రదర్శించిన దాంపత్య జీవితం ఏ సమాజానికైనా ఆదర్శమని చెప్పారు. సత్యనిష్ఠ, ధర్మ దృష్టి, మహిళపై గౌరవం, పాలకుడి రుజువర్తనం, క్షమా గుణం, సంయమనం విలువలను రామాయణం ప్రబోధించిందని తెలిపారు. మితిమీరిన కామ ప్రవృత్తి ఎలా వినాసనకరమో రామాయణం చెబుతుందన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ రామాయణం వేద స్వరూపమని, రాముడి గుణగణాలు ఆదర్శంగా ఆచరించదగినవని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, కె.వి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.